క్లుప్తంగా

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో ఎంఈఓ రమేశ్ తదితరులు

యాలాల: మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని నూతన ఎంఈఓ రమేశ్‌ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. ఇటీవల మండల ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రిష్టారెడ్డి, రాములు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

ఎంపీడీఓ కరీం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కరీం

పరిగి: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కరీం పంచాయతీ సిబ్బందికి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం సమీపిస్తున్నందున ప్రతి ఇంటికీ మంచి నీరు సరఫరా అయ్యేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. అలాగే వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాలని తెలిపారు. జాబ్ కార్డులు లేని కుటుంబాలకు కార్డులు ఇవ్వడంతోపాటు కూలీలందరికీ పనులు కల్పించాలని సూచించారు.

కష్టపడి చదవండి

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి



మోడల్ స్కూల్ వార్షికోత్సవంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు

తాండూరు రూరల్: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. శనివారం తాండూరు మండలం ఐనెల్లి శివారులోని మోడల్ స్కూల్, కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యా ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. ఇంటర్మీడియట్ రెండో సంవ త్సరం, పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు, రైతులకు రుణాలు ఇవ్వాలి

తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్



కేక్ కట్ చేస్తున్న మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమల్, బ్యాంక్ సిబ్బంది

తాండూరు: కెనరా బ్యాంకు ద్వారా మహిళలకు, రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని కెనరా బ్యాంకు రూ.100 కోట్ల టర్నోవర్ చేరుకుంది. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్‌తో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మహిళలకు, రైతులకు రుణాలను అందించాలన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రుణాలను అందించాలని సూచించారు. అందుకు బ్యాంకు మేనేజర్ సానుకూలంగా స్పందించారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కేశంపేట: కారోబార్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య అన్నారు. శనివారం మండల కారోబార్లు, బిల్ కలెక్టర్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మండల కమిటీని ఎన్నుకున్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం

- ప్రతీ పంచాయతీలో 5వేల చొప్పున
- నిర్వహణ పనులు పరిశీలిస్తున్న అధికారులు
- గ్రామాల్లో ఉపాధి పొందుతున్న కూలీలు



గుండేపల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీ

దౌల్తాబాద్: రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా నర్సరీల్లో హరితహారానికి మొక్కలు సిద్ధం చేస్తున్నారు. దీని కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతీ పంచాయతీకో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని విరివిగా చేపడుతున్నారు. వాటిని నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతీ పంచాయతీలో 5వేల మొక్కల చొప్పున మొత్తం మండల వ్యాప్తంగా 1.65లక్షలు మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవుతున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయ ప్రాంగణాలు, బస్టాండ్, రోడ్లకు ఇరువైపులా, రైతులకు ఉపయోగపడే విధంగా అన్ని రకాల మొక్కలు నాటించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పండ్ల మొక్కలైన నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఉసిరితో పాటు పూల మొక్కలైన గులాబీ, మందార, గన్నేరు, కాగితపు పూలు తదితర మొక్కలతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు జామ, మారేడు వంటి మొక్కలను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీ పనులను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ రంజిత్‌కుమార్ పరిశీలిస్తున్నారు.

కూలీలకు ఉపాధి

మండలంలోని అన్ని పంచాయతీల్లో నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొక్కల పెంపకం పనుల్లో ఒక్కో గ్రామంలో 40మంది కూలీలకు ఉపాధి దొరుకుతుంది.

“పనులు పర్యవేక్షిస్తున్నాం

గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీ పనులు సాగుతున్నాయి. మండలంలో హరితహారం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు పలు సూచనలు అందిస్తున్నాం.

– రవీందర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, దౌల్తాబాద్

నర్సరీల్లో మట్టి పనులు, కవర్లలో మట్టి నింపి మొలకలను నాటించడం, నర్సరీలకు నీరు పట్టడం వంటి పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు

ఎంపీడీఓ విశ్వప్రసాద్



సమావేశంలో పాల్గొన్న కార్యదర్శులు

తాండూరు రూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు ఇస్తానని ఎంపీడీఓ విశ్వప్రసాద్ హెచ్చరించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో తాండూరు మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కార్యదర్శులు ప్రతీరోజు గ్రామాల్లో పర్యటించాలన్నారు. నర్సరీలు అధ్వానంగా ఉన్నాయని అంసతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీలో మొక్కలకు నీటి సౌకర్యం కల్పించి జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. మార్చి, ఏప్రిల్, మేలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శులను ఆదేశించారు. బోరు మోటార్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలని సూచించారు. పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం మరువలేనిది



కొడంగల్ రూరల్: నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

యాలాల: ఎస్సీ వర్గీకరణకు పోరాడి అమరులైన వీరుల త్యాగం మరువలేనిదని ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మెట్టి సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. శనివారం యాలాల మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..30 ఏళ్ల ఆకాంక్షే వర్గీకరణ అని గుర్తు చేసుకున్నారు. వర్గీకరణ కోసం ఎంతో మంది మాదిగ వీరులు అమరులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సలహాదారు మెట్టి క్రిష్ణ, నరేందర్, క్రిష్ణ, శివ, ప్రవీణ్, నర్సింహులు, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: అమరవీరులకు దళిత సమాజం రుణపడి ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వెంకట్రాములు, మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వెనుకబాటుకు గురవుతున్న దళితులు అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధికార ప్రతినిధి నల్లమల్ల మొగులయ్య, సంఘ నాయకులు కృష్ణయ్య, ఎల్లయ్య, వెంకటయ్య, జె.వెంకటయ్య, లాలు, రాములు, వెంకటనర్సింలు, చంద్రయ్య, బాలకృష్ణ, భాను, ప్రవీణ్, సాల్వీడు రాములు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి అంజి మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 58మాదిగ ఉపకులాల రిజర్వేషన్ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాన్ని వెలకట్టలేమన్నారు. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ మెంబర్ దస్తప్ప, ప్రజా సంఘాల నాయకులు యూ.రమేష్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్, జి.చంద్ర, శేఖర్, హనుమప్ప, కనకప్ప, జి.సాయిలు, కె.శివకుమార్, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం



ధారూరు: ధారూరులో ఎంఐఎం జెండా ఆవిష్కరిస్తున్న మోయిజ్‌ఖురేషి



కొడంగల్ రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు గుల్షన్

కొడంగల్ రూరల్: ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పార్టీ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సర్తజ్ హుస్సేన్, షేక్ రోమన్, సయ్యద్ ముస్తాఫా, షేక్ అజర్, ఎండీ.ఆబీద్, సుల్తాన్ సైఫాన్, నిసార్ బేగ్ పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: ధారూరులోని సాయిరీ గ్రౌండ్‌లో పార్టీ జెండాను మండల అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఐఎం ప్రజలు మన్ననలు పొందటం వల్లే దేశంలో పార్టీ మనుగడ సాధ్యమౌతుందన్నారు. దేశ ప్రజల్లో ఎక్కువ మంది పార్టీని ఆదరిస్తున్నారని, ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో గెలవడమే దీనికి నిదర్శనమన్నారు.

మోడల్ పేపర్స్ అందజేత

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్ కోట్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా మోడల్ పేపర్స్ అందజేశారు. పాఠశాలలో పని చేస్తున్న ఇంగ్లిష్ టీచర్ సువర్ణ రాణి తన సొంత డబ్బులతో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమేశ్, తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయ పునర్‌నిర్మాణానికి దాతలు సహకరించాలని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు నాగయ్య కోరారు. గ్రామంలోని ఓ పొలంలో సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరిందన్నారు. అదే స్థలంలో గ్రామస్తుల సహకారంతో ఆలయ పునర్‌నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో స్థిర పడ్డ గ్రామవాసి డాక్టర్ జానమోళ్ల రఘువీర్‌రెడ్డి రూ.1,11,000ల విరాళం ప్రకటించారన్నారు. త్వరలో ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తామని, దాతాలతో పాటు తను కూడా రూ.51వేలు ఆలయ నిర్మాణానికి విరాళం అందజేశానన్నారు. ఆసక్తి ఉన్న దాతలు ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీశివభక్త మార్కండేయ దేవాలయ వార్షికోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంతో ప్రారంభించారు. దేవతామూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రెండోరోజు యంత్ర ప్రతిష్ఠాపన పూర్ణాహుతి మంగళ హారతి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నూతన కమిటీ ఎన్నిక



శ్రీనివాసులు

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గ అంబేడ్కర్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. తాలూకా కమిటీ అధ్యక్షుడిగా చెవిటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, చంద్, ప్రధాన కార్యదర్శిగా బాలు, కార్యదర్శులుగా రాములు, కృష్ణ, కోశాధికారిగా సురేష్‌బాబులను నియమించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఎంఈఓ వెంకట్



ఐనాపూర్ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో సైన్స్‌లో ప్రయోగ నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎంఈఓ వెంకట్ సూచించారు. శనివారం దోమ మండల పరిధిలోని ఐనాపూర్ పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను వీక్షించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సర్ సీవీ రామన్ కాంతిపై ప్రయోగాలు చేసి రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న రోజును సైన్స్ డేగా జరుపుకుంటారని తెలిపారు. సైన్స్ లేనిదే జీవితం లేదన్నారు. నిత్యజీవితంలో సైన్స్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబుచాంద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెగ్యా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎస్ఐ అన్వేష్ రెడ్డి, తదితరులు

కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్ రెడ్డి

కుల్కచర్ల: ఆత్మరక్షణకు కరాటే అవసరమని కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. బాలికలు ఎందులోనూ తక్కువకాదన్న మానసిక సంకల్పంతో ముందుకుసాగాలని ఆయన తెలిపారు. శనివారం కుల్కచర్ల మండలం రాంపూర్ గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో మంచి, చెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఆత్మరక్షణలో భాగంగా తమను తాము కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కరాటే వంటి దేహధారుఢ్య అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి సబితరాణి, కరాటే మాస్టర్ కరీముద్దీన్, సిబ్బంది సాయిలు, విక్రం తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’ సేవలు అభినందనీయం

- కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి
- గిరిజన గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీమెటీరియల్‌ను అందిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: పదో తరగతి విద్యార్థుల కోసం సాక్షి మీడియా చేస్తున్న కృషి అభినందనీయమని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి అన్నారు. శనివారం సాక్షి మీడియా ఆధ్వర్యంలో కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలోని గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లోని 1,200మంది నిరుపేద విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి, సాక్షి మీడియా ప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



కుల్కచర్ల: వాల్యనాయక్ తండాలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు



బషీరాబాద్: రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అజయ్ ప్రసాద్, మాధవరెడ్డి తదితరులు

కాంగ్రెస్ నేతలు అజయ్‌ప్రసాద్, మాధవరెడ్డి

బషీరాబాద్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పీఏసీఎస్ వైస్ చైర్మెన్ అజయ్‌ప్రసాద్, ఏఎంసీ చైర్మెన్ మాధవరెడ్డి పేర్కొన్నారు. బషీరాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.2.75కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రి ముందు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రెండేళ్లలో తాండూరు రూపురేఖలు మారబోతున్నాయని పేర్కొన్నారు. రూ.30 కోట్లతో బషీరాబాద్–కరణ్‌కోట్ రోడ్డు మార్గం పనులు కొనసాగుతున్నాయన్నారు. త్వరలో లక్ష్మీనారాయణపూర్–మైల్వార్ నాలుగు లేన్ల రోడ్డు పనులు ప్రారంభిస్తారని చెప్పారు. రూ.10కోట్ల నిధులతో త్వరలోనే సివిల్ ఆస్పత్రి నూతన భవనానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

ఆస్పత్రికి మరమ్మతులు

రూ.4లక్షల ప్రత్యేక నిధులతో మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో మరమ్మతుపనులు, ఆయా వసతులు కల్పించనున్నామన్నారు. విద్యుదీకరణ, తాగునీటి వసతి, వంటి పనులు చేయిస్తామన్నారు.

కుల్కచర్ల: ప్రతీ పల్లెను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగుతుందని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్ప్రాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం చౌడాపూర్ మండలం వాల్యనాయక్ తండా గ్రామపంచాయతీలో రూ.5లక్షలతో ఉపాధి హామీ నిధులతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ గ్రామానికి రహదారులు ఏర్పాటుచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల అభ్యున్నతికి నిర్విరామంగా కృషిచేస్తుందన్నారు. మండల ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, మాజీ ఉప సర్పంచ్ చందర్, నాయకులు లావుడ్య శ్రీను, లోక్య గోపి, లాలు, బాబ్య, హర్య, సురేష్, పాల్గొన్నారు.

రైతు సమస్యలు తీరే దారేది?

- అదనపు ఇన్‌చార్జితో తప్పని పనిభారం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు



మోమిన్‌పేటలో రైతు వేదికకు తాళం

మోమిన్‌పేట: మోమిన్‌పేట క్లస్టరులో పనిచేస్తున్న ఏఈఓ పెంటయ్యకు అదనంగా వెల్‌చాల్ క్లస్టరు ఇవ్వడంతో మోమిన్‌పేట రైతు వేదికకు సకాలంలో హాజరు కాలేకపోతున్నారు. దీంతో అక్కడికి వచ్చే రైతుల సమస్య పరిష్కరించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా రైతుల ఖాతాలో జమ చేస్తుండటంతో కొంత మంది రైతులకు అర్హత ఉన్న వారి ఖాతాల్లో జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమస్యను పరిష్కరించుకునేందుకు రైతు వేదికకు వెళ్తే అక్కడ ఏఈఓ ఉండడం లేదని చెబుతున్నారు. రబీలో సాగు చేస్తున్న పంటలను ఆన్‌లైన్ చేయడంలో నిమగ్నమైన ఆయన రైతు వేదికకు సకాలంలో రావడం లేదని చెబుతున్నారు. రెండు క్లస్టరులలో ఆన్‌లైన్ చేయడం వల్లే అందుబాటులో ఉండడం లేదని పెంటయ్య బదులిస్తున్నారు. ఒకే క్లస్టరు ఉన్నప్పుడు ఉదయం పూట పంటల సాగు ఆన్‌లైన్ చేసి, మధ్యాహ్నం నుంచి రైతు వేదికలో రైతులకు అందుబాటులో ఉండేవాడినని ఆయన తెలిపారు. అదనంగా మరో క్లస్టరు విధులను అప్పగించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంటల సాగును సకాలంలో ఆన్‌లైన్‌చేయకపోతే అమ్ముకునే సమయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారని, వాటిని నివారించేందుకే పంటల సాగు వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఏఓ పేర్కొన్నారు. ఇదే సమయంలో రెండు క్లస్టరులకు సంబంధించిన రైతులు రైతు భరోసా నిధులు జమకాని వారు సమస్యను పరిష్కరించుకునేందుకు రైతు వేదికకు వస్తున్నారు. అక్కడ సమయానికి అందుబాటులో ఉండకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి ఏఈఓకు పనిభారం తగ్గించాలని, రైతులకు అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.